నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 14 జులై 2023
1

రేపటి మెగా జాబ్‌మేళాను సద్వినియం చేసుకోవాలి

నస్పూర్ : నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించాలని ఉద్దేశంతో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు న్యాయవాది అక్కల తిరుపతి వర్మ తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 15న శనివారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సిఎ ఫంక్షన్ హాల్‌లో పెద్ద ఎత్తున జాబ్ మేళా ఉంటుందన్నారు. 70 మల్టీ నేషనల్ కంపెనీలతో సుమారు నాలుగువేల పైచిలుకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏడవ తరగతి నుండి పీజీ విద్యార్హత ఉన్న వారందరూ మేళాలో పాల్గొనేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. అనంతరం జాబ్ మేళా ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్ వర్మ, కర్రె తిరుపతి, జనార్ధన్, బియ్యాల సత్తయ్య నరేందర్, సింగతి నరేందర్, అరవింద్, కుమార్ పాల్గొన్నారు.



రాజనీతి శాస్త్రంలో రాజేశ్వర్‌కు డాక్టరేట్



లక్ష్మణచాంద : మండల కేంద్రానికి చెందిన ఆడెపు రాజేశ్వర్ రాజనీతి శాస్త్ర విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. యుజిసి మాజీ సభ్యులు, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.గోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో 'అసెస్మెంట్ కో-రిలేషన్ బిట్వీన్ లెవల్ ఆఫ్ పార్టిసిపేషన్ ఇన్ లోకల్ గవర్నెన్స్ అండ్ పొలిటికల్ ఎంపవర్మెంట్ ఆఫ్ వుమెన్ ఆఫ్ డిఫరెంట్ సోషల్ స్ట్రాటా ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనకు ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. రాజేశ్వర్ ప్రస్తుతం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్ర విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. పిహెచ్‌డి పరిశోధనలో తనకు సహకరించిన గురువులు, ప్రొఫెసర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణ ప్రభుత్వ పాఠశాల నుండి ప్రారంభమైన రాజేశ్వర్ విద్య ప్రస్థానం నేడు మండలంలో డాక్టరేట్ పొందిన మొదటి వ్యక్తిగా నిలవడం విశేషం. డాక్టరేట్ పొందిన రాజేశ్వర్‌ను గ్రామ సర్పంచ్ ముత్యంరెడ్డి, జడ్‌పిటిసి ఓస రాజేశ్వర్, ఎంపిటిసి నర్సారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అడ్వాల పద్మ రమేష్ అభినందించారు.

రిమ్స్ వైద్యం..అస్తవ్యస్తం..!

- బయటి విభాగానికి వందల మంది రోగులు
- ఓపీ చీటి కోసం గంటల తరబడి నిరీక్షణ
- మించిపోతున్న సమయం..పేదలకు అందని చికిత్స
- ఆటంకం మారిన ఆధార్ అనుసంధాన విధానం

రిమ్స్ వైద్యం అస్తవ్యస్తంగా మారుతోంది. పేదలకు సకాలంలో వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది. సర్కారు ఆస్పత్రుల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం చికిత్సకు ఆటంకం ఏర్పడుతోంది. రిమ్స్ బయటి రోగుల విభాగంలో వైద్యులకు చూపించాలంటే ఓపీ చీటి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఆధార్ నెంబర్ చెప్పాల్సి ఉంటుంది. రోగుల పేర్లకు ఆధార్ అనుసంధానం చేయడం ఆలస్యం కావడం మూలంగా రోగులు సకాలంలో వైద్యం అందుకోలేకపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈహెచ్‌ఎంఎస్)ను రిమ్స్‌లోనూ అమలు చేస్తున్న అధికారులు ఇందుకనుగుణంగా సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. కేవలం ఓపీ చీటి అందజేసే విభాగంలో కేవలం రెండు కంప్యూటర్లు మాత్రమే ఉండటం.. రోజువారీగా వందల సంఖ్యలో జనాలు వస్తున్నారు. చీటి కోసం గంటల తరబడి నిరీక్షించడం ..అప్పటికే సమయం ముగిసిపోవడంతో డాక్టర్లు వెళ్లిపోతున్నారు. పేదలకు చికిత్స అందడం గగనంగా మారుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వరంలా మారిన రిమ్స్ ఆస్పత్రిలో లోపాలు కొనసాగుతునే ఉన్నాయి. రోజూ వందలాది మందికి వైద్యసేవలు అందిస్తున్న ఈ ఆస్పత్రిలో నిర్లక్ష్యం జాడలు అదే స్థాయిలో ఉంటున్నాయి. ప్రభుత్వం రోగులు వారి వైద్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా ఒక యాప్ తయారుచేసింది. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే యాప్‌లో ఆస్పత్రికి వచ్చే రోగుల పేర్లతో పాటు ఆధార్ నెంబర్లను అనుసంధానం చేస్తున్నారు. దీంతో ఒక రోగి చికిత్స తీసుకున్న అనంతరం మరేక్కడైనా హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స తీసుకుంటే సంబంధిత రోగికి సంబంధించి ఆరోగ్య పరీక్షల వివరాలన్ని తెలుసుకునేందుకు సులువుగా ఉంటుంది. ఈ విధానం మంచిదేనైనా అమలులో మాత్రం లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధికారయంత్రాంగం ఇందుకనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటుచేయకపోవడం పేద రోగులకు ప్రాణసంకటంగా మారుతోంది. ఓపీ విభాగంలో రెండు మాత్రమే కంప్యూటర్లు ఉండటం.. రోగుల ఆధార్‌నెంబర్లను తప్పనిసరిగా నమోదు చేయాల్సి రావడం మూలంగా ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా వివిధ ప్రాంతాల నుంచి వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ రిమ్స్‌కు వచ్చే రోగులను మరింత అవస్థలకు గురిచేస్తోంది.

వైద్యులు వెళ్లిపోతున్నారు..!

రిమ్స్ ఓపీకి రోజువారీగా సుమారు 1500మంది వరకు చికిత్సల కోసం వస్తుంటారు. సీజనల్ వ్యాధులు ప్రబలేకాలం కావడంతో రోగుల సంఖ్య ప్రస్తుతం రోజుకు 1800వరకు ఉంటుంది. వీరికి చికిత్స అందించేందుకు ఓపీ విభాగం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే పనిచేస్తుంది. కానీ నూతన విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఆధార్ అనుసంధానంలో ఆలస్యం జరగడం మూలంగా అనేక మంది రోగులు గంటల తరబడి ఓపీ చీటి విభాగం వద్దనే నిరీక్షిస్తున్నారు. వారు చీటి తీసుకొని డాక్టర్ దగ్గరికి వెళ్లే సరికి సమయం మించిపోతోంది. మధ్యాహ్నం 12గంటలు దాటగానే వైద్యులు ఓపీ నుంచి వెళ్లిపోతుండటం.. వందల మంది రోగులు ఓపీ విభాగం వద్దనే ఉండిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సకాలంలో వైద్యం అందని కారణంగా అనేక మంది పేదలు మరుసటిరోజు రావడం.. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న వారు గత్యంతరం లేక ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఈ విధానం అమల్లోకి వచ్చి దాదాపు నెలరోజులకు పైగా కావస్తుండటం.. అప్పటి నుంచి రోగులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నా అధికార యంత్రాంగం దృష్టిసారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోగులు ఇబ్బందులు పడుతున్నారు : రూపేష్‌రెడ్డి, యువకుడు



రిమ్స్‌లోని బయటి రోగుల విభాగంలో రోగుల వివరాలకు ఆధార్ అనుసంధానం ఉండటంతో చాలా ఆలస్యం జరుగుతోంది. ఆస్పత్రికి వచ్చే రోగులు గంటల తరబడి అక్కడే నిరీక్షిస్తున్నారు. తీరా సమయం మించిపోయిన తర్వాత చీటీ లభించినా వైద్యులు ఉండకపోవడంతో చికిత్స తీసుకోకుండానే నిరాశగా వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి ఈ విభాగంలో మరిన్ని సౌకర్యాలు కల్పించి రోగులకు వైద్య సేవలు సులభతరం చేయాలి.

డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి



నవతెలంగాణ - హాజీపూర్

ఆండాలమ్మ కాలనీలో ఉన్న డంప్ యార్డ్‌ను తొలగించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆండాలమ్మ కాలనీని అనుకరొని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కనే మున్సిపాలిటీ అధికారులు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ స్థలాన్ని సీపీఐ(ఎం) నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని కాలనీలో సేకరించిన చెడు వ్యర్థాలను ఇక్కడకు తెచ్చి కాల్చడం ద్వారా గాలిలో కాలుష్యం, దుర్వాసనతో చుట్టూ పక్కన నివాసం ఉంటున్న ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కాలుష్య గాలి పీల్చడం ద్వారా ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధిన బారిన పడుతున్నారన్నారు. ప్రజలకు ప్రమాదం జరగకముందే అధికారులు వెంటనే డంపింగ్ యార్డ్‌ను ఇక్కడి నుండి వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కాలనీ ప్రజలను ఐక్యం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, రాజేశ్వరి, దుంపల రంజిత్‌కుమార్, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి చలో కలెక్టరేట్‌కు తరలిరావాలి

- ఎస్పీఎం గేటు ముందు సీఐటీయూ ప్రచారం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

షెడ్యూలు పరిశ్రమ జీఓ సవరించాలని, ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ముందు చేపట్టే ధర్నా కార్యక్రమానికి ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం ఎస్పీఎం గేటు ముందు ప్రచారం చేపట్టారు. దీనికి సంబంధించిన కరపత్రాలను కార్మికులకు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, అంబాల ఓదేలు మాట్లాడుతూ ప్రస్తుతం మిల్లులో జీఓ నెంబర్ 11ను అమలు చేస్తున్నారని, అది కూడా పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని అన్నారు. కార్మికుల నైపుణ్యతను బట్టి వేతనాలు కాకుండా ఒకే రకంగా వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. ఐదేళ్లకోసారి వేతన సవరణ చేపట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నం చేయడం లేదని అన్నారు. కాబట్టి మిల్లు కాంట్రాక్టు కార్మికులు ఈ ధర్నాలో పాల్గొని కనీస వేతనాలకు పోరాటం చేయాలని కోరారు.

జెడ్పీలో జీపీఎఫ్ విభాగం ప్రారంభం



నవతెలంగాణ - హాజీపూర్

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి జిపిఎఫ్ విభాగానికి గురువారం ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమం అనంతరం జెడ్పీ చైర్మన్ విజయవంతంగా నాలుగు సంవత్సరాల నుండి ఐదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంలో కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నరేందర్, ఆర్.లక్ష్మీనారాయణ, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్‌లో మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

హైదరాబాద్‌లోని నాగోల్‌లో శుక్రవారం గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ తెలిపారు. సమావేశంలో అన్ని జిల్లాలకు నూతన ఇంచార్జీలను నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల నిర్వహణపై చర్చించి, తేదీలను ప్రకటించడంతో పాటు గీత కార్మికులపై తెలంగాణ ప్రభుత్వ వైఖరిపై చర్చిస్తామన్ని వెల్లడించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం కోసం నిర్వహించే రాష్ట్ర కమిటీ సమావేశానికి తెలంగాణలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

16న గోలేటిలో ఆయుర్వేద వైద్యశిబిరం

నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రిసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో 16న ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహిస్తామని పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్లు, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, మలబద్ధకం, ఆస్తమా, స్త్రీల వ్యాధులకు మందులు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలోని కార్మికులు, మాజీ కార్మికులు, కుటుంబసభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు ఉరేసి దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతుల పట్ల రేవంత్‌రెడ్డి విషం చిమ్మడాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకిస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపురావ్ పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీసి జాతీయ రహదారిపై దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రైతులను అవమానించి మాట్లాడటం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతుల పట్ల ఇంత అమానుషంగా మాట్లాడినప్పటికీని బిజెపి నాయకులు రైతుల పక్షాన నిలబడి నిరసన కార్యక్రమాలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. దీని ద్వారా బీ టీమ్ పాత్ర ఎవరు పోషిస్తున్నారనేది స్పష్టంగా అర్థమవుతోందన్నారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకపోతే నాలుక కోసేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ రైతుల పాలిట రాబందు పార్టీ అని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రౌతు మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహిర్ రంజాని, పట్టణ అధ్యక్షుడు అజయ్, రైతు సమన్వయ అధ్యక్షులు రోకండ్ల రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, శివకుమార్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్, వివిధ మండల కన్వీనర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



16న మంచిర్యాలలో బీసీ నిరసన దీక్ష

నవతెలంగాణ-హాజీపూర్

బీసీ జనగణన సాధన కోసం మంచిర్యాలలో ఈ నెల 16న జరుగనున్న నిరసన దీక్షను ప్రజలు విజయవంతం చేయాలని వివిధ బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాలలో కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ జనాభా లెక్కలు సేకరిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాల ఒత్తిళ్లకు తలొగ్గి నేడు వెనక్కు జరిగిందని వారు ఆరోపించారు. బీసీల జనాభా లెక్కలు తేలితేనే రిజర్వేషన్లు, ఇతర సంక్షేమ ఫలాలు బీసీ ప్రజలకు న్యాయంగా దక్కుతాయని పేర్కొన్నారు. 1931లో చివరిసారి బీసీల లెక్కలు తీయగా స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమని వారు పేర్కొన్నారు. బీహార్‌లో నితీష్‌కుమార్ ప్రభుత్వం బీసీ జనగణన చేపడితే అగ్రవర్ణ దురహంకారులు కోర్టుకెక్కి నిలుపుదల చేయించారని తెలిపారు. బీసీ జనగణన కేంద్రమే చేపట్టాలని సుప్రీంకోర్టు సైతం తేల్చి చెప్పిందని వారు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బీసీ జన గణన చేపట్టేలా దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తున్నారని, మంచిర్యాల జిల్లాలోనూ బీసీ వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించి బీసీ జనగణను సాధించుకోవాలని వారు పిలుపునిచ్చారు. మండల కమిషన్ సిఫార్సులు పూర్తిగా అమలు చేసి బీసీల సంక్షేమానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణనను సాధించే దిశలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన దీక్ష జరగనుందని, జిల్లా వ్యాప్తంగా బీసీ వర్గాల ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఆ దీక్షకు మద్దతు తెలపాలని వారు కోరారు. వివిధ పార్టీలలో పని చేస్తున్న బీసీ నాయకులు సైతం దీక్షలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి నాయకులు మోతె రామదాసు, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, కురుమ సంఘం జిల్లా నాయకులు సమ్మ రాజన్న, బీసీ నాయకులు మహేశ్, మోరె చరణ్, రాములు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాదక ద్రవ్యాల నియంత్రణపై పోలీసు శాఖ సమన్వయంతో జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. గురువారం ఎస్పి సురేష్ కుమార్‌తో కలిసి రెవెన్యూ, పోలీసు, ఆబ్కారీ, వ్యవసాయ శాఖ అధికారులతో మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణపై సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు పత్తి పంటలో గంజాయి పంటను సాగు చేస్తున్నారని, వ్యవసాయ, విస్తరణ అధికారులు పర్యవేక్షించి, ఉన్నట్లయితే ధ్వంసం చేసి సంబంధిత రైతులకు రైతుబంధు నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలో గంజాయి, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, మహారాష్ట్ర నుండి గంజాయి జిల్లాలోకి రాకుండా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని, సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. మారుమూల గ్రామాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల వల్ల జిల్లాలో కేసులు తగ్గాయని, సంబంధిత శాఖల అధికారులు ప్రతినెల మాదకద్రవ్యాల నియంత్రణపై సమీక్షించాలని తెలిపారు.

మన ఊరు మన బడి పనులు వేగవంతం చేయాలి

- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి



నవతెలంగాణ-దస్తురాబాద్

మన ఊరు మనబడి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని గొడిసెర్యాల, గుండుగూడ, మున్యాల, దస్తురాబాద్ గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం, ఉన్నత పాఠశాల నూతనంగా మన ఊరు మనబడి పథకం ద్వారా కోటి రూపాయలతో చేపట్టిన తరగతి పనులను పరిశీలించారు. జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రతిమను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరతను పరిష్కరిస్తామన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పట్ల నిర్లక్ష్యం వహించరాదని ఉపాధ్యాయులను ఆదేశించారు. వికలాంగులకు పెన్షన్ రావడం లేదని చెప్పడంతో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో భాస్కర్‌రెడ్డి, నిమ్మతోట రాజమణి, శివయ్య, దుర్గం శంకర్ పాల్గొన్నారు.

టింబర్ యార్డ్ ఉద్యోగుల వేతన సమస్య పరిష్కరిస్తాం



నవతెలంగాణ-నస్పూర్

టింబర్ యార్డ్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాల సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి తెలిపారు. గురువారం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో టింబర్ యార్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించుటకు గ్రీవెన్స్‌లో చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, డీజీఎం ఐఈడి చిరంజీవులు, డీజీఎం స్టోర్స్ యాదయ్య, టింబర్ యార్డ్ ఇన్చార్జ్ జక్కరెడ్డి, డివైపిఎంలు రాజేశ్వరరావు, దేవేందర్‌రెడ్డి, టింబర్ యార్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు అవగాహనకు ఈవీఎంల ఏర్పాటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఓటు వినియోగించుకుని విధానంపై అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్ భవన సవందాయంలో ఈవిఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బొర్కడే హేమంత్ తెలిపారు. గురువారం ఆర్డిఓ రాజేశ్వర్‌తో కలిసి ఈవిఎంలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ఉద్యోగులు, కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులకు ఓటు వినియోగించుకునే విధానం తెలిసే విధంగా ఈవిఎంను ఏర్పాటు చేశామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహనా



కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. కాచి చల్లార్చిన నిటిని తాగాలని అన్నారు. నిటిని నిల్వ ఉంచోద్దని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ఎంపీడీఓ శేఖర్‌కు, వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నసీరుద్దీన్, ఆశా సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోచమ్మకు గంగ జలాలతో అభిషేకం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి) మహిళలు గురువారం భక్తి శ్రద్ధలతో గంగా జలాలు సల్ల కుండాతో భజంత్రీల నడుమ కాలినడకన గ్రామ దేవతలతో పాటు అడెల్లి మహా పోచమ్మ ఆలయంలో అభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యశోద, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



తునికాకు బోనస్ పంపిణీ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అన్ని జిల్లాలో తునికాకు బోనస్ పంపిణీ ప్రారంభించాలని, ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా పోడు భూముల కేసులను ఎత్తివేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ రాకేష్ మోహన్ దొబ్రీయల్‌కి హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. పోడు భూముల కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తునికాకు బోనస్ పంపిణీ అన్ని జిల్లాలో ప్రారంభించాలన్నారు. అలాగే ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా పోడు సాగుదారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి కుమార్ పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపై నడిపితే కఠిన చర్యలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు రోడ్డుపై నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రవీంధర్ గురువారం ప్రకటన పేర్కొన్నారు. కేజ్‌విల్స్ రోడ్ మిద తిరిగి రోడ్ డ్యామేజ్ చేసినట్లయితే అట్టి కేజ్‌విల్స్ యజమానులపై చట్ట రీత్యా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులు పంట పొలం చుట్టూ ఎలాంటి అనుమతులు లేకుండా కరెంటు తీగలు అమర్చినట్లయితే అట్టి తీగలు తగిలి ప్రజలు, వన్యప్రాణుల మరణించే ప్రమాదం ఉందని ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అక్రమ డిప్యూటేషన్‌లు రద్దు చేసి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓపై ఎంక్వేరి చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. ఈ విషయమై గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రమ డిప్యూటేషన్‌లకు సంబంధించిన కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా కొనసాగుతున్న నరేందర్ రాథోడ్ జిల్లాలో దాదాపుగా 50, 60 అక్రమ డిప్యూటేషన్‌లు చేపట్టారని ఆరోపించారు. ఈ అక్రమ డిప్యూటేషన్‌లు చేపట్టడంతో మండల స్థాయి ప్రజలకు వైద్యం అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీనికి కలెక్టర్ స్పందించి విచారణ చేపడుతామని ఇది నిజమని తేలితే ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామడుగు జాషువా, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు తబ్రెస్‌ఖాన్, మునీర్‌లు ఉన్నారు.

రైతు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన కొత్తూరు ఆశన్న రైతు, ఇటీవల మరణించడంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబానికి అండగా నిలబడుతూ ఇచ్చినటువంటి రైతు బీమా రూ.5 లక్షల చెక్కును మృతుడి కుటుంబానికి గురువారం ఎమ్మెల్యే జోగు రామన్న అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేసి ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతాంగం వ్యవస్థ మీద విసుకు చెందకుండా వారికి అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. రైతు బీమాతో ఆ కుటుంబానికి ధీమాగా ఉంటూ ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ జిట్టా రమేష్, కుమ్ర రాజు, రమేష్, మాజీ ఎంపీపీ జగదీష్, అష్రాఫ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్



సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎంపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో పారిశుధ్యం, తాగునీరుపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ఏ ఒక్క కేసు నమోదు కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు పలు సూచనలు చేశారు. మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అన్నారు. రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. చెత్త చెదారం డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. గ్రామాల్లోని గుంతల్లో నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటి పైపులు లీకేజీలను అరికట్టాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోనెల గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజేందర్, ఎన్సిడీ పోగ్రాం ఆఫీసర్ డా.శ్రీనివాస్, డా.శుబాష్, డా.అలీ, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కెఎం గౌడ్, సరస్వతి, ఎఎన్ఎంలు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గానికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ గురువారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష,కార్యదర్శులు అయిన నారాయణ, కృష్ణలను సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణలో విశ్వహిందూ పరిషత్ భాగస్వామ్యం ఎంతో ఉందని అన్నారు. సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా హిందూ ధర్మాన్ని నిలబెట్టడంలో విశ్వహిందూ పరిషత్ ముందుందని అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో విశ్వహిందూ పరిషత్ హిందూ సమాజానికి సేవలు అందిస్తుందని అన్నారు. నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేస్తూ మరింత ముందుకు వెళుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దినేష్ మటోలియ. జ్యోతిరెడ్డి, ముకుంద్, ఆకుల ప్రవీణ్, కార్యకర్తలు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న



నవతెలంగాణ-నార్నూర్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎనిమిదో రోజు కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు 11వపీఆర్సీని వర్తింపజేయాలని అన్నారు. పోరాటాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి నిత్యం కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం మేమో నెంబర్ 48ని తీసుకువచ్చి పాఠశాలలను ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని అదనపు పని భారాన్ని వేసిందని అన్నారు. వారి వెంట పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు భాలే శ్రీనివాస్, ఆత్రం సోనేరావ్, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఇతర చట్టబద్ధహక్కులు, సౌకర్యాలు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జగన్‌సింగ్ ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 12, 769 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సుమారు 50 వేల మంది గ్రామపంచాయతీ కార్మికులకు వారి శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా లాంటి చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కూడా అమలు కావడం లేదని అన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేరడిగొండ : రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో ఉందని బీజేపీ మండల అధ్యక్షులు సోమయ్య హీరసింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు బీజేపీ మండల నాయకులు మద్దతు తెలిపి వారితో పాటు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు రూ.19వేల వేతనం ఇచ్చి బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. తక్షణమే వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి లేనియెడల పారిశుధ్య కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు సంతోష్, సోలంకి ప్రశాంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంధం నవీన్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, ఓబీసీ మోర్చా మండల కార్యదర్శి బొంతుకుల శ్రీను, నాయకులు సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-సారంగాపూర్

రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని, చౌరస్తాల వద్ద బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం చేస్తున్న మంచిని ఓర్వలేకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణలు చెప్పి తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలేబుద్ధి చెబుతారని హెచ్చరించారు. రైతులకు 24గంటలు కరెంట్ ఉచితంగా అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి సొసైటీ చైర్మెన్లు నారాయణరెడ్డి, మాణిక్‌రెడ్డి, ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, అడెల్లి ఆలయ చైర్మెన్ చందు, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాధవ్‌రావు, ఆయ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : రైతులకు ఉచిత కరెంటు గురించి టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రేవంత్ దిష్టి బొమ్మ దహనం చేశారు. రైతుల సంక్షేమం కొరకు రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులను కించపరిచేలా మాట్లాడితే ఊరుకోమని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ హెచ్చరించారు. రైతులకు అన్యాయం చేసే కాంగ్రెస్ పార్టీకి రైతుల గురించి మాట్లాడే హక్కు లేదని బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, రైతు సమన్వయ సమితి చైర్మెన్ శాతం గంగారాం, ఎంపీటీసీ గుజ్జరి గణేష్, నాయకులు గురల లింగారెడ్డి, బిట్లింగ్ నారాయణ, జహీర్, ఓస మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : వ్యవసాయానికి కేవలం మూడు గంటల కరెంటు మాత్రమే సరిపోతుందని టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి చేసిన వాక్యాలు రాజకీయ



దుమారం రేపుతున్నాయి. గురువారం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని రోడ్డుపై బైఠాయించి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతులకు అండగా నిలిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ మాత్రం రైతుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలపై కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ధరణి వద్దని, ఉచిత కరెంటు వద్దని కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీగా ముద్ర వేసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, బీఆర్ఎస్ నాయకులు పాల్దె శ్రీనివాస్, గుణవంత్‌రావు, పల్లె సుధాకర్ రెడ్డి, కుంట గంగాధర్, ముదోల్ నరేంధర్, కోడె నవీన్, నంద ముత్యం, కొప్పుల చిన్నయ్య, దుప్పి సాయన్న, సప్పల రవి, రమాకాంత్, చిట్టి సుభాష్, సప్పల నర్సయ్య, పీసరి విలాస్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మద్యం తాగి వాహనాలు నడపటం నేరమని అలా నడిపిన వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని రాచపూర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం గురించి పూర్తి వివరాలతో గురువారం డీఎస్పీ ప్రకటన విడుదల చేశారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. రాచపూర్ గ్రామానికి చెందిన జడ రాజేశ్వర్(54), ఎప్పటిలాగే ఉదయం లేచి, రాచాపూర్ నుండి వ్యవసాయ పనుల నిమిత్తం పొట్టపెల్లి(కె) గ్రామం వైపు వెళ న్నాడు. మరోవైపు మండల కేంద్రానికి చెందిన అరిసెల నరేష్(22), తన సొంత అన్న అరిసెల రాకేశ్‌కు చెందిన టెంట్ హౌస్‌లో అతని అన్నకు చెందిన అశోక లేల్యాండ్ వాహనం టీఎస్ 21టి 0424 ను నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. రోజులాగే పనిలో బాగంగా మంగళవారం ఉదయం 06 గంటల సమయంలో నిర్మల్‌లో డెకోరేషన్ పని మీద వెళుతూ అతని ఇంట్లో దాచుకున్న మద్యం తాగి లక్ష్మణచాంద నుండి నిర్మల్‌కి బయలుదేరాడు. ఉదయం 06:30 గంటల సమయంలో రాచాపూర్ గ్రామ శివారుకు చేరుకొనగా జడ రాజేశ్వర్ నడుచుకుంటూ ఎదురుగా వస్తున్నాడు. నరేష్ మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ జడ రాజేశ్వర్‌ను డీ కొట్టడంతో అతనికి బలమైన రక్త గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో జడ రాజేశ్వర్ అపస్మారక స్థితిలో ఉండిపోయాడు. బాధితున్ని నిర్మల్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించే లోపే చనిపోయాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. మద్యం సేవించి అజాగ్రత్తగా వాహనం నడిపిన నిందితునిపై సెక్షన్ 304-ఐపీసీ కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి త్వరితగతిన కేసును చేదించిన సోన్ సీఐ నవీన్ కుమార్, లక్ష్మణచాంద ఎస్సై రాహుల్, సిబ్బంది సాయి, సునీల్, గణేష్, వనితలను నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ జీవన్‌రెడ్డి అభినందించారు.

ఆర్జీయూకేటీ విద్యార్థులకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో గురువారం ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు పారిశ్రామికవేత్తగా ఎదగడం ఎలా అనే అంశంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెల్ ఆధ్వర్యంలో గమ్యం బిలాంగ్, ఎక్సోటల్ అనే సంస్థ ప్రతినిధులు సాయితేజ, విజయ్‌శర్మ విద్యార్థులతో చర్చించారు. వ్యాపార అవకాశాలను సామర్థ్యాన్ని కలిగి ఉన్న వ్యక్తులు వ్యవస్థాపకులు గా ఎదుగుతారని, దానికి కావాల్సిన నైపుణ్యాలను కలిగి ఉండేందుకు వివిధ స్థాయిలలో సామర్థ్యాన్ని కలిగి ఉండాలని అన్నారు. కొత్త ఎంటర్‌ప్రైజ్‌లో సృజనాత్మక ఉత్పత్తి పద్ధతులు, వ్యవస్థాపకులుగా రూపాంతరం చెంది మార్కెటింగ్ అవకాశాలు అందిపుచ్చుకునే శక్తిని ఎలా పొందాలో విశ్లేషణాత్మకంగా వివరించారు. ఉద్యోగ అవకాశాలు లేని విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎలా ఎదగాలో శిక్షణ తరగతుల్లో వివరించారు. అంతేకాకుండా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే, సరైన కమ్యూనికేషన్ చేయగలుగుతారని, ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి వ్యక్తుల సమూహాన్ని నిర్వహించడం ప్రధానమైనదని అన్నారు. ఒక వ్యవస్థాపకుడిలో కనిపించే నాయకత్వ లక్షణాలు జట్టు కృషి, భాగస్వామ్య లక్ష్యం, ఖచ్చితమైన



మార్గదర్శకత్వం పలు అంశాలపై విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు చర్చించారు. కార్యక్రమంలో ఇంక్యుబేషన్ ఇన్నోవేషన్ సెల్ కోఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, హరిబాబు, స్వప్నిల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బదిలీతో కన్నీటి పర్యంతమైన విద్యార్థులు

నవతెలంగాణ-బాసర

తమ పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని బదిలీపై వర్క్ సర్దుబాటు కింద వేరే పాఠశాలకు పంపిస్తుండటంతో ఆ పాఠశాల విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన మండలంలోని కిర్గుల్(బి) ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటుచేసుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్న నర్సింగరావు అనే ఉపాధ్యాయుడు. ఇప్పుడు స్థానికంగా ఉన్న హైస్కూల్‌కు పని సర్దుబాటు కింద పంపిస్తూ ఉత్తర్వులు రావడంతో ప్రాథమిక పాఠశాల పిల్లలు మాస్టర్ వెళ్తుంటే అడ్డుతగిలారు. మాకు బాగా చదువు చెప్పేసార్‌ని పక్క బడికి పంపొద్దని విద్యార్థులు కంట తడి పెట్టారు. ఇది చూసిన సిబ్బంది. విద్యార్థులకు నచ్చజెప్పారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో రూ.2కోట్లతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గురువారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ మున్సిపల్ అధికారులతో కలిసి పనులను పర్యవేక్షించారు. శ్మశాన వాటికలోని వెల్కం ఆర్చీ పనులను పరిశీలించారు. అలాగే పూర్తయినటువంటి వాటర్ ట్యాంక్‌తో పాటు ప్రహరీ గోడలు ఇతర పనులను పర్యవేక్షించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరగా పూర్తిచేసి, పలు సూచనలు తెలియజేశారు. అనంతరం చైర్మెన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రత్యేక నిధులు కేటాయిస్తూ సుందరీకరణగా తీర్చిదిద్దడమే కాకుండా హరిత ఆహారాన్ని పెంపొందిస్తూ శ్మశాన వాటికలను సుందరీకరణగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు అరుణ్, తిరుపతి ఉన్నారు.

బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

బీసీ విద్యార్థుల రియంబర్స్‌మెంట్ డబ్బులతో పాటు స్కాలర్‌షిప్ డబ్బులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. బీసీ విద్యార్థుల పరిస్థితి చూస్తే చాలా దయనీయంగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 4 వేల కోట్ల బీసీ విద్యార్థుల ఫీజుల రియంబర్స్‌మెంట్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు రియాంబర్స్‌మెంట్ డబ్బులు రావడంలేదని దీనితో ప్రయివేటు విద్య సంస్థల్లో చదువుకుంటున్న బీసీ విద్యార్థులను యాజమాన్యాలు తీవ్ర ఒత్తిడులు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా బీసీ విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేయాలని, చేయకుంటే జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.

బస్ కోసం మేనేజర్‌కు వినతిపత్రం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అదిలాబాద్ మండలంలోని తంతోలి, అంకోలి లోకారి, వాన్వట్, మామిడిగూడ, పిప్పల్‌దరి, గ్రామాల్లో బస్సు రావడం లేదని, ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు కాలేజ్‌లకు, స్కూల్‌లకు వెళ్లే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాలకు ఉదయం పూట సాయంత్రం పూట బస్సు సౌకర్యం కల్పించాలని గురువారం అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ మేనేజర్‌ను కలిసిన వారిలో దండు మధుకర్, లోకారి రవి, సామ రూపేష్‌రెడ్డి ఉన్నారు.

ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటి విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్, జరస్ టెక్నాలజీ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఐటి కంపెనీలలోని సాఫ్ట్వేర్ డెవలప్‌మెంట్, సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఐటీ కంపెనీలలో కెరీర్ అవకాశాల గూర్చి సంబంధిత ఐటి నిపుణుల అనుభవాలను విద్యార్థులు తెలుసుకున్నారని డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ ఆదేశాల మేరకు ఇలాంటి ప్రత్యేకమైన ఐటీ కంపెనీల సందర్శనకు బ్యాచుల వారీగా విద్యార్థులను ఎంపిక చేసి పంపించడం జరుగుతుందన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రయివేట్ సెల్ పాయింట్‌ను గురువారం ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటి వినియోగదారుకు తన చేతుల మీదుగా మొబైల్ ఫోన్ అందించారు. అనంతరం అంబారిపేట్ గ్రామంలో మైసమ్మ బోనాల పండుగ నిర్వహించగా బోనాల పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోనమెత్తుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేసి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, వైస్ ఎంపీపీ కట్ట శ్యాంసుందర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు గొల్ల వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్తన్న, అంబారిపేట్ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, ఎంపీటీసీ కట్ల సింధుజా సాగర్, మాజీ ఎంపీటీసీ ముత్తినేని తిరుపతి, నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, కడెం సర్పంచ్ అనూషలక్ష్మణ్, సోషల్ మీడియా ఇన్‌చార్జీ ఎండీ హసీబ్, అంబారిపేట్ ఉపసర్పంచ్ కొండవేని ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బైరి రవి, మిల్కూరి సత్తన్న, గ్రామస్తులు పాక భూమన్న, నరేందుల ప్రసాద్, బైరి సత్తన్న, రేంకల రాజన్న, సదువుల రాజేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని బుధవారం విద్యాసంస్థలు బంద్ విజయవంతం అయ్యిందని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం బాస్కర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భుక్తాపూర్ ఏఐవైఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మెస్రం భాస్కర్ మాట్లాడుతూ వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. నోట్ బుక్‌లు, పాఠ్యపుస్తకాలు మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. సంక్షేమ హాస్టల్లో వసతులు కల్పించాలని అన్నారు. ప్రయివేటు, కార్పొరేటు విద్యసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి గుర్తింపు లేని పాఠశాలలపై సర్కారు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేసి, బోధన సిబ్బందిని నియమించి నూతన భవనాలు నిర్మించాలని అన్నారు. వసతి గృహాలు ప్రమాద పరిస్థితిలో ఉన్నాయని నూతన భవనాలు ఏర్పాటు చేసి రెగ్యులర్ వార్డన్ కుక్ పోస్టులు నియమించాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. సమావేశంలో నాయకులు దేవిదాస్, గోపాల్, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
3
శుక్రవారం 14 జులై 2023

ఐటీఐలో రెండవ దశ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో మిగిలి ఉన్న సీట్లకు రెండవ దశ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 2023-24 ఎన్సివిటి ప్యాటర్న్ కింద వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్‌లో శిక్షణ పొందుటకు జన్నారం ప్రభుత్వ ఐటీఐలో రెండవ దశ అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల చివరి గడువు ఈ నెల 31 వరకు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ఎస్ఎస్‌సీ మెమో, క్యాస్ట్, ఇన్కమ్, బోనాఫైడ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, టీసీ, ఆధార్ కార్డు, మెయిల్ ఐడి, సెల్ నెంబర్లను ఐటీఐ.తెలంగాణ.జీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల అనుసరించి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకొని, ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ రియాజ్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా గ్రామాల యువతి, యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలని, అలాగే ఏమైనా మార్పులు చేర్పులు ఉన్న అభ్యర్థులుమా సిబ్బంది బీఎల్ఓలు, వీఆర్ఏలు, అంగన్వాడీ టీచర్లు కొత్తగా ఓటరు నమోదు చేస్తున్నారని, మీ ఓటరు నమోదు కొరకు మీ రెండు ఫోటోలు, ఒక ఆధార్ కార్డు జిరాక్స్, బోనఫైడ్ లేదా టిసి జిరాక్స్‌లు ఇవ్వగలరాని తెలిపారు. ఓటర్ లిస్ట్ బీఎల్ఓలు, వీఆర్ఏలు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సమాఖ్య సభ్యురాల్ల వద్ద ఉందని మీ ఓటు ఉందా లేదా తెలుసుకోవాలని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 13, 14 మాత్రమే కలదని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వేజ్‌బోర్డ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

11వ వేజ్ బోర్డు అమలైనందున వేజ్ బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియా సీహెచ్‌పీలో ఆ ఏరియా సహాయ కార్యదర్శి గుడిగంటి నరసింగరావు అధ్యక్షతన అమ్మా గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 23 నెలల ఏరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే లాభాల వాటా యాజమాన్యం ప్రకటించిన రూ.700 కోట్లు కేసీఆర్ మంచిర్యాల బహిరంగ సభ సందర్భంగా ప్రకటించారని అందువల్ల 11వ వేజ్ బోర్డు ఏరియర్స్‌ను, లాభాల వాటాను యాజమాన్యం వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ డబ్బులను ఈ సమయంలో ఇచ్చినట్లయితే కార్మికుల పిల్లలకు స్కూల్ ఫీజులకు సంబంధించి చాలా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సింగరేణి ఎన్నికలు నిర్వహించి ఆరు సంవత్సరాలు గడుస్తున్న యాజమాన్యం ఎన్నికలు నిర్వహించడం లేదని, సింగరేణి ఎన్నికలకు యాజమాన్యం, ప్రభుత్వం జంకుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, పిట్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి సల్ల తిరుపతి, ఆర్కే-5 పిట్ కార్యదర్శి శ్రీనివాస్, ట్రేడ్స్ మెన్ ఇన్‌ఛార్జి నంబయ్య, మధు, బల్లి సురేష్, రమేష్, శేఖర్, శ్రీను, మంతెన సతీష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని డీటీడీఓకు వినతి



నవతెలంగాణ-కెరమెరి

కుంరం పురిటి గడ్డ జోడేఘాట్ గ్రామంలోని ఏయూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కుంరంభీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్ గురువారం డీటీడీఓ దిలీప్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 1 నుంచి 7వ తరగతులు న్నాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయునితో పాటు సరిపడా ఉపాధ్యాయ సిబ్బంది లేరని డీటీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆదివాసీ పేద విద్యార్థులకు చదువు అందకుండా పోతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యార్థులు నష్టపోకుండా వెంటనే ఉపాధ్యాయ సిబ్బందిని నియమించాలని కోరారు.

17న నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-హాజీపూర్

గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట చేపట్టే నిరసన దీక్షను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ గురుకులా రాష్ట్ర కన్వీనర్ డి.ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు కోరారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులకు పారిటి స్కేల్స్ మంజూరు చేయాలన్నారు. హెల్త్ కార్డ్స్ మంజూరు చేయాలని, గురుకుల ఉపాధ్యాయులపై పని భారం, మానసిక ఒత్తిడి తగ్గించాలని కోరారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, అన్ని గురుకులాల్లో బదిలీలు, పదోన్నతుల కౌన్సిలింగ్ వెంటనే విడుదల చేయాలన్నారు. అన్ని సొసైటీల్లో ఏకరూప పరిపాలన అమలు చేయాలన్నారు. టీఎస్ అర్ఈఐఎస్, ఎంజేపీ విద్యా సంస్థలో బోధనా సమయాన్ని ఇతర సొసైటీల్లో మాదిరిగా మార్చాలాన్నారు. ఈ దీక్ష కార్యక్రమానికి, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బీ.కిరణ్, జిల్లా కార్యదర్శి వీ.కిరణ్ కుమార్ మంచిర్యాల మండల అధ్యక్షులు బారిక్‌రావు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సేవా సమితి శ్రీరాంపూర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవింద రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 సంవత్సరానికి గాను వృత్తి శిక్షణ కోర్సులైన టైలరింగ్, మగ్గం, బ్యూటీషన్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్ కోర్సులు శిక్షణ ఇచ్చేందుకు ఫ్యాకల్టీల (టీచర్స్) నుండి దరఖాస్తులను కోరారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో జత చేసి జులై 20వ తేదీ వరకు జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఇవ్వాలని అన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-మందమర్రి

ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం స్థానిక సింగరేణి పాఠశాల విద్యార్థుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కండ్లకు గంతలు కట్టుకుని జీపీ కార్మికుల నిరసన



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె గురువారం 8వ రోజుకు చేరింది. ప్రభుత్వం తమ సమస్యలను చూడనట్టు వ్యవహరిస్తుండడంతో కార్మికులు కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి తమ సమస్యలు చూసి గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జీపీ కార్మికుల సంఘం నాయకులు ముంజం ఆనంద్ కుమార్ కోరారు. గ్రామాలలో ఇప్పటికే చెత్త పేరుకపోయిందని, దీంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బంది పని చేయకపోవడం ప్రజారోగ్యం దెబ్బతింటోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బి.రమేష్, సురేందర్, మహేష్, సాయి, ధర్మయ్య, పావని, భాగ్య, సంధ్య పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 8 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందనలేదని అన్నారు. కనీస వేతనం రూ.19500 చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జన్నారం : పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కూకట్ కారు బుచ్చయ్య అన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట గత నాలుగు రోజులుగా నిరావధిక సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, గ్రామపంచాయతీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లును పరిష్కరించాలన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. ఈ సమ్మెకు పోతపెల్లి సర్పంచ్ దాసరి చంద్రమౌళి మద్దతు తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు కండ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కారోబార్‌లు శ్రీనివాస్, శ్రీకాంత్, చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప
- రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతు వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఆ పార్టీ రైతుల పక్షపాతిగా ఉండదనే విషయం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో నిరూపితమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప అన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేటీఆర్ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉచిత విద్యుత్ రైతులకు వరంగా మారిందని దానిపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు క్షమార్హం కానివన్నారు. తన నియోజకవర్గంలోని తాటిపెల్లిలో 221 ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో అక్కడ రైతులకు రూ.4 కోట్ల పంట పండిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తుంటే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ సంక్షేమ పథకం తలుపు తట్టని ఇల్లు లేదని గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. హనుమంతుడు గుడి లేని ఊరు ఏ విధంగా అయితే ఉండదో బీఆర్ఎస్ సంక్షేమ పథకం లేని ఇల్లు లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలు 'కప్పల వలె' వస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని దీనికి నిదర్శనమే దేశంలో వరి పంటలో రాష్ట్రం రెండవ స్థానంలో నిలవడం అన్నారు. రానున్న రోజుల్లో మొదటి స్థానంలో నిలవడం ఖాయమన్నారు. అంతకుముందు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, టీడీపీలు విద్యుత్ విషయంలో ఎటువంటి విధానాలు అవలంబించాయనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు జగ్గాగౌడ్, జిల్లాలోని వివిధ మండలాల జడ్పీటీసీలు రామారావు, సంతోష్, అజయ్ కుమార్, ఎంపీపీలు సౌందర్య, విమల భాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు కాసం శ్రీనివాస్, మల్లేష్, ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : తెలంగాణ రైతాంగానికి ఉచిత విద్యుత్ అవసరం లేదని అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద ఆయన దిష్టిబొమ్మ దహనం చేశారు. సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రైతులను అవమానపరిచే విధంగా ఉన్నాయని, కేసీఆర్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందని, రాబోవు కాలంలో కాంగ్రెస్ పార్టీకి రైతులు గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



నూతన కలెక్టరేట్‌లో పారిశుధ్య నిర్వహణ భారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అన్ని హంగులతో నిర్మించిన ఆసిఫాబాద్ సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహణ లోపిస్తోంది. అధికారులకు కావాల్సిన వసతులతో, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ రూ.50 కోట్ల వ్యయంతో ఎనిమిది ఎకరాల స్థలంలో విశాలమైన భవనాలతో నూతన కలెక్టరేట్ నిర్మాణం చేశారు. ఇంత బాగా చెబుతున్న కలెక్టరేట్ నిర్వహణ రానున్న రోజుల్లో భారంగా మారేలా ఉందని సంకేతాలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్ కార్యాలయంలోకి దాదాపు కొన్ని శాఖలు మినహా అన్ని శాఖలు వారికి కేటాయించిన గదుల్లోకి మారాయి. సీఎం కేసీఆర్ గత నెల 30వ తేదీన నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించిన నాటి నుంచి పూర్తిస్థాయిలో శుభ్రం చేయించలేదు. కార్యాలయ ఆవరణలో ఉన్న గడ్డితో పాటు, లాన్‌లో ఇతర షో చెట్లు ఎప్పటికప్పుడు కట్ చేయాల్సి ఉంటుంది. కానీ అదేది జరగడం లేదని తెలిసింది. కలెక్టరేట్ ప్రతిరోజు శుభ్రం చేయడానికి కనీసం 50 మంది వరకు పనివారు అవసరమయ్యే అవకాశం ఉంది. గతంలో కొన్ని శాఖలు చిన్న చిన్న భవనాల్లో ఉండడంతో ఎవరికి వారుగా ఆయా శాఖల గదులను శుభ్రం చేసుకుంటున్నారు. ప్రస్తుతం అన్ని శాఖలు ఒకే చోటుకి చేరడంతో ఎవరు భవన శుభ్రత చూడాలని విషయంపై ఇప్పటి నుంచి అధికారులు తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. ప్రతిరోజు వందల మంది జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వస్తారు. గడిచిన నాలుగు రోజుల్లోనే కలెక్టరేట్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చినవారు తమ దగ్గర ఉన్న ఖాళీ నీళ్ల బాటిల్స్ ఇతరత్రా తినుబండారాలకు సంబంధించిన కవర్లు పడేయడంతో కలెక్టరేట్‌లో చెత్త పేరుకుపోతోంది. ఇలాగే కొనసాగితే కలెక్టరేట్ ప్రాంగణం చెత్తమయంగా మారే అవకాశం ఉందని పలువురు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ ప్రతిరోజు శుభ్రం చేయడానికి ప్రైవేట్ ఏజెన్సీకి బాధ్యత అప్పగిస్తే బాగుంటుందని అధికారులు అంటున్నారు. అయితే ప్రతి అంతస్తులో ఉన్న విభాగాలకు చెందిన జిల్లా అధికారులు కలిసికట్టుగా అంతస్తు పరిశుభ్రత కోసం బాధ్యత తీసుకోవాలని గతంలో ఒక సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. ఇదే జరిగితే ప్రతి నెల ఒక్కో అధికారికి నిర్వహణ నిమిత్తం రూ.5000 ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఏది ఏమైనా రానున్న రోజుల్లో నూతన కలెక్టరేట్‌తో కొంత సౌలభ్యం ఉన్నప్పటికీ నిర్వహణ కష్టంగా మారుతుందని అధికారులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటాడనే విషయంపై కలెక్టరేట్ నిర్వహణ ఆధారపడి ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నీరు నిలువ ఉన్నచోట అవసరమైన మందు పిచికారి



చేయాలన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ, బోదకాలు, మెదడు వ్యాపుతో పాటు ఇతర వ్యాధులను అరికట్టడానికి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఇండ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని, దీనికోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కువగా నీళ్ల నిలువ ఉండే చోట మత్స్యశాఖ ఆధ్వర్యంలో గంబుసియా చేపలు పెంచడం లాంటి కార్యక్రమాలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి సురేందర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారిని మణెమ్మ, సీఈఓ రత్నమాల, మిషన్ భగీరథ అధికారి వెంకటపతి, ఇన్‌ఛార్జి విద్యాధికారి ఉదయ బాబు, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

రైతు బీమా పథకానికి దరఖాస్తు స్వీకరణ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం రైతు కుటుంబం సంక్షేమానికి ప్రవేశపెట్టిన రైతు బీమా పథకానికి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయం అధికారిణి మధులత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులు రైతు భీమా పథకానికి గత నెల జూన్ వరకు కొత్త పట్టాపాస్ బుక్ వచ్చి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకువాలని, అలాగే ఇదివరకే రైతు బీమా చేయించుకున్నా రైతులు ఆధార్ కార్డులో ఏమైనా మార్పులు చేర్పులు ఉన్న లేదా నామినీని మార్చాలానుకున్న వారు మీ క్లస్టర్ పరిధిలో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలవయస్సు గలవారు మాత్రమే అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకొనే రైతులు తమ భూమి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బోసిపోయిన కలెక్టరేట్ పాత భవనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆవిర్భావం తర్వాత 2016 నుండి జిల్లా కేంద్రంలో ఐటీడీఏ ఓట్నూర్ ఆధ్వర్యంలో నిర్మించిన వైటీసీ భవనంలో కలెక్టరేట్‌తో పాటు పలు శాఖల కార్యాలయాలు కొనసాగాయి. అప్పటి నుంచి ఆ ప్రాంతం ఎప్పుడు రద్దీగా కనిపించేది. తాజాగా గత నెల 30వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభించిన తర్వాత పాత కలెక్టరేట్ ఆవరణలో ఉన్న కార్యాలయాలు ఒక్కొక్కటిగా నూతన భవనంలో వారికి కేటాయించిన గదులలోకి తరలించారు. తాజాగా గురువారం నాటికి ట్రెజరీ మినహా అన్ని కార్యాలయాలు పాత భవనం నుండి ఖాళీ చేయడంతో పాత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణ బోసిపోయింది. అయితే ఆ భవనం ఎవరికీ కేటాయిస్తారనే విషయం ఇంకా కొలిక్కి రాలేదని అధికారులు తెలుపుతున్నారు. జిల్లా కేంద్రంలో స్థలం లేదని అవసరమైన భవనాలు లేవని కొన్ని విద్యా సంస్థలు కాగజ్‌నగర్ కేంద్రానికి తరలి వెళ్ళిపోయాయి. తాజాగా ఎంజేపీ డిగ్రీ కళాశాల కూడా అక్కడికి వెళ్లే ప్రమాదం ఉందని యువజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాత కలెక్టరేట్ భవనాన్ని ఏదైనా విద్యాసంస్థకు అప్పగించాలని యువజన, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఉచిత విద్యుత్ పేరిట కేసీఆర్ దోపిడీ

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ



నవతెలంగాణ-కాసిపేట

సీఎం కేసీఆర్ ఉచిత విద్యుత్ పేరిట, రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారులు నియమించుకొని, భారీ కుంభకోణానికి తెరలేపారని, తెలంగాణలో ఏ ప్రాంతానికి వెళ్లిన ఎనిమిది గంటలకు మించి, విద్యుత్తు అందించిన పాపాన పోలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల కృష్ణ విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి మాట్లాడిన వాక్యాలను వక్రీకరించి, దుష్ప్రచారం చేస్తున్న సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం మండలంలోని కొండాపూర్ సబ్ స్టేషన్ ఎదుట దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఏనాడు అధికార ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీపై ధర్నాలు చేసిన చరిత్ర లేదని, రోజురోజుకు కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక ప్రజలను పక్కదోవ పట్టించేందుకు, సొంత మీడియాను వాడుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలందరూ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సిద్దం తిరుపతి, ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, మెరుగు పద్మ శంకర్, భీమ్రావు, మైనార్టీ సెల్ మండల షాకీర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుల రాకేష్, కనకరాజు, ముత్యల రాజమౌళి, మాజీ సర్పంచులు జాడి శంకరయ్య, ప్రభాత్ రావు, మైదం రమేష్, శివ, మహంకాళి, గోపి, శ్రీను, అచ్యుతారావు పాల్గొన్నారు.

రాంపూర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం

- 10 మందిపై దాడి చేసిన కుక్కలు

నవతెలంగాణ-జన్నారం



మండలం రాంపూర్ గ్రామంలో 80 ఏండ్ల వృద్ధురాలైన నాగుల లచ్చవ్వపై పిచ్చికుక్కలు దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధురాలు రోజు లాగే ఆమె ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గ్రామంలో తిరిగే పిచ్చి కుక్కలు ఒక్కసారిగా పైన పడి తీవ్రంగా దాడిచెసి గాయపరిచాయి. చుట్టుపక్కల వారు వచ్చి ఆ కుక్కను కొట్టడంతో లచ్చవ్వ ప్రాణాలతో బయటపడింది. వృద్ధురాల బంధువులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా గ్రామంలో మరో 9 మందిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో లక్షెట్టిపేట్ ఆస్పత్రికి తరళించారు.

యాదవుల ఆర్థికంగా అభివృద్ధికి గొర్రెల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండలంలోని కవ్వాల్ గ్రామంలోని యాదవులకు 12 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. గంగపుత్రులకు ద్విచక్ర వాహనాలు చేప పిల్లల పంపిణీ, నాయి బ్రాహ్మణుల కటింగ్ షాపులకు ఉచిత విద్యుతు, రజకుల బట్టల ఇస్త్రీ షాపులకు ఉచిత విద్యుత్, ఇలా అన్ని కులాలకు సహాయాన్ని అందిస్తూ వారిని మరింత ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ వర్గాల ప్రజలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కవ్వాల్ గ్రామ సర్పంచ్ లక్ష్మీ కలిరాం ఎంపీటీసీ సౌజన్య పవన్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శుక్రవారం 14 జులై 2023

మానవత్వం చాటుకున్న సీఐ సాదిక్‌పాషా

నవతెలంగాణ - సిర్పూర్(టీ)



ప్రజల రక్షణకే కాకుండా ఆపదలో ఉన్న వారికి కూడా తోడు నిలుస్తున్నారు సిర్పూర్ పోలీసులు. మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన టకారె బిక్కు నెల క్రితం పిడుగుపడి మృతి చెందిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐ దీకొండ రమేష్ మృతుడి కుటుంబానికి 50కిలోల బియ్యం, రూ.5వేల ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. మృతుడి కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటిన సాదిక్‌పాషా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామస్తులు పోలీసులను అభినందించారు. భరోసా కల్పించి కుటుంబానికి అన్ని విధాలుగా చేయూతనందిస్తామని సీఐ, ఎస్ఐ పేర్కొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలని వినతి



రెబ్బెన: పల్లె ప్రకృతివనంలో పెంచిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని బుధవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌కు డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో హడావుడిగా అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటారని, వాటిలో కొన్ని మానవజాతికి హాని కలిగించేవి ఉన్నాయని తెలిపారు. కోనో కార్పస్ మొక్క మానవజాతికి అతి ప్రమాదకరమైందని పరిశోదకులు చెప్పారని పేర్కొన్నారు. పల్లె ప్రకృతివనాల్లో నాటిన వాటిని వెంటనే తొలగించి ఆక్సిజన్ అందించే చెట్లను నాటాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాపిడి శివ, సహాయ కార్యదర్శి చల్లూరి కృష్ణ పాల్గొన్నారు.

రైతుల పార్టీ బీఆర్ఎస్

- తొమ్మిదేండ్లలో రైతుల కోసం సంక్షేమ పథకాలు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్



నవతెలంగాణ-జైపూర్

రైతు రాజ్యమా..రైతు వ్యతిరేక విధానమా..తేల్చుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. ధరణి వద్దు ఉచిత కరెంట్ రద్దు అంటూ కాంగ్రెస్ చేస్తున్న కుట్రకు నిరసనగా గురువారం చెన్నూర్ నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి స్థానిక గాంధీచౌక్ నుండి తెలంగాణ తల్లి విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ విధానాన్ని ఖండిస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. తెలంగాణతల్లి చౌక్‌లో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ధర్నాలో బాల్క సుమన్ మట్లాడారు. రైతుల కోసం పుట్టి రైతుల కోసం పని చేస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల్లో తెలంగాణ సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఉచిత కరెంట్, రైతుబీమా, రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించమంటే రైతులను పిట్టల మాదిరిగా కాల్చి చంపిన చరిత్ర గత ప్రభుత్వాలదని తెలిపారు. గత ప్రభుత్వాల పాలనలో అర్ధరాత్రి అపరాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరా చేసిన సందర్భంలో అనేక మంది రైతులు పాము, తేలు కాటుకు బలైన సందర్భాలు అనేకమని పేర్కొన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఒక బ్లాక్ మెయిలర్ అని అభివర్ణించారు. ధరణితో ఆయన భూదందాలు, సెటిల్మెంట్లు సాగడం లేదన్న అక్కసుతో ధరణి రద్దు చేయాలంటున్నాడని విమర్శించారు. ఉచిత కరెంట్ వద్దన్న కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. అహంకారంతో మాట్లాడిన కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో నిలదీయాలన్నారు.

మన ఊరు మనబడి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి చేపట్టిన మన ఊరు మనబడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యా, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో మన ఊరు మనబడి పనులకు సంబంధించి ఫోటో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు పాఠశాలల్లో పనులు ఆలస్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ఊరు మనబడి ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న పనులు ఆలస్యం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. త్వరగా వాటిని పూర్తిచేయాలని ఆదేశించారు. మరమ్మత్తులు పూర్తికాని పాఠశాలల మరమ్మతులు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

15న మొదటి విడత చెక్కుల పంపిణీ

బీసీలకు ప్రభుత్వం అందజేయనున్న లక్ష రూపాయల సబ్సిడీ రుణ చెక్కుల పంపిణీ మొదటి విడత కార్యక్రమాన్ని ఈ నెల 15 నుండి చేపట్టాలని బీసి సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. బీసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి కలెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 15 నుండి మొదటి విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలన్నారు. చెక్కుల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో 300 మంది లబ్ధిదారులను మొదటి విడతలో గుర్తించినట్లు తెలిపారు. వీరికి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడానికి ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారికి ఏఈఓల వినతి



నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలం కిష్టంపేట రైతువేదికలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పనకు గురువారం ఆ మండలం ఏఈఓలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసినట్లు తెలిపారు. ఒక క్లస్టర్ ఏఈఓకు 5వేల ఎకరాలు మాత్రమే ఉండాలని, కానీ కొంతమంది ఏఈఓలకు 9నుంచి13వేల ఎకరాలు కేటాయించారని, దీంతో క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ప్రతి రైతు వేదికకు ఒక వీఆర్ఏను అనుసంధానం చేయాలన్నారు. రైతు వేదిక మెయింటనెన్స్ కోసం వచ్చే నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, డబ్బులు త్వరగా పడేవిధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమం ఏడీఏ బాపు పలువురు ఏఈఓలు పాల్గొన్నారు.

చేయని పనికి బిల్లు కోసం
గిరిజన మహిళా సర్పంచ్‌పై ఒత్తిడి


- పని చేయనందున బిల్లు చెల్లించేది లేదని స్పష్టం చేసిన సర్పంచ్
- అధికారపార్టీ ఒత్తిళ్లు తట్టుకోలేక సర్పంచ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు(టి) నియోజకవర్గంలో అధికారపార్టీ ఒత్తిళ్లు మితిమీరుతున్నాయి. పాలనాయంత్రాంగంలో వీరి జోక్యం హెచ్చుమీరుతోంది. దీనికి అధికారులే కాదు, ప్రజాప్రతినిధులు కూడా ఇబ్బందుల పాలవుతున్నారు. ఇందుకు నిదర్శనంగా బెజ్జూరు మండలం ఊట్‌సారంగపల్లి పంచాయతీలో కొన్ని రోజులుగా అంతర్గతంగా చోటు చేసుకుంటున్న సంఘటనను చెప్పవచ్చు. సర్పంచ్ కొడప విమల, పెసా(పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూలు ఏరియాస్) ఉపాధ్యక్షులు కొడప విశ్వేశ్వర్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఊట్‌సారంగపల్లి పంచాయతీ పరిధిలోని అర్కగూడలో తలండి జలపతిరావు ఇంటి నుండి విలేజ్ చౌరస్తా వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.5 లక్షల నిధుల మంజూరు కోసం గత డిసెంబర్‌లో పంచాయతీ తీర్మాణం చేశారు. కాని అదే గ్రామంలోని గంగారాం ఇంటి నుండి తిరుపతి ఇంటి వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యినట్లు పంచాయతీరాజ్ ఏఈ ఎఫ్‌టీఓ అందజేశారు. వాస్తవంగా ఆ స్థలంలో నూతనంగా ఎలాంటి సీసీ రోడ్డు నిర్మాణం లేదు. అక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ తీర్మాణమే లేదని, సీసీ రోడ్డు నిర్మాణం ఎలా చేపడుతారంటూ సర్పంచ్ బిల్లు మంజూరు చేయకుండా ఆపారు. దీనితో ఆ మహిళా సర్పంచ్‌పై అధికారపార్టీ నేతల ఒత్తిళ్లు అధికమయ్యాయి. నేతలు దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా గత నెల 26న ఎంపీఓ సర్పంచ్‌కు లేఖ పంపారు. 2022-23 సంవత్సరంలో మంజూరైన ఈ పనికి బిల్లు చెల్లింపు చేయాలని, లేని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ లేఖలో పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మౌఖిక ఆదేశాల మేరకు ఈ లేఖ జారీ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనితో గత నెల 28న సర్పంచ్ కొడప విమల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చేయని పనికి బిల్లు చెల్లింపు చేయాలని అధికారపార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిబంధనల ప్రకారం ఈ పని లేదని ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



పోలీసుల సమక్షంలో వాగ్వివాదానికి దిగిన ఇరు గ్రూపులు



పంచాయతీ తీర్మానం చేసిన కాపీ

పని చేపట్టేందుకు ముందుకు వచ్చిన యువకులు

పంచాయతీ తీర్మానం చేసిన తలండి జలపతిరావు ఇంటి నుండి విలేజ్ చౌరస్తా వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి అర్కగూడకు చెందిన యువకులు ముందుకు రాగా సర్పంచ్ అంగీకారం తెలిపారు. గురువారం యువకులు పని చేపట్టేందుకు యత్నించగా అధికారపార్టీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఎఫ్‌టీఓ సమర్పించిన రహదారిపై సీసీ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ తీర్మాణం ఉంటే తీసుకురావాలని సర్పంచ్ విమల, పెసా ఉపాధ్యక్షులు విశ్వేశ్వర్ అధికారపార్టీ నేతలకు సూచించడంతో కొంత ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనాస్థలానికి చేరకున్న బెజ్జూరు ఎస్ఐ వెంకటేష్ ఇరు వర్గాలను సముదాయించి పంపించివేశారు. దీనిపై పంచాయతీరాజ్ ఎఈ మక్బుల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కండ్లకు గంతలతో పారిశుధ్య కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో గ్రామపంచాయతీ కార్మికులు వారం రోజులుగా కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు, గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ 8రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టింపులేనితనంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, 11వ పిఆర్సి ప్రకారంగా వేతనాలు, పది లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మికుల డిమాండ్లను ఎంపీ, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అంబేద్కర్ సెంటర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జాడే బాపు కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా కార్యదర్శి రాజేందర్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చునార్కర్ శంకర్, నాయకులు ఎం.రాజు, టి.సమ్మయ్య, బోయల నగేష్, మహేష్, కైలాస్ పాల్గొన్నారు

మందమర్రి : ఎంపీడీఓ కార్యాలయం ముందు గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్, మండల అధ్యక్షుడు కడారి జీవన్‌కుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, పీఆర్సి నిర్ణయించిన కనీస వేతనం రూ.19వేలు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లని పంచాయతీ సహాయ కార్యదర్సులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోవతి రాజయ్య, జిల్లా అధికార ప్రతినిధి వడ్నాల శ్రీను, మాజీ సర్పంచ్ తిరుపతి, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు పాషా, వడ్నాల బాపు, అమిరుద్దీన్, మాస్ సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

రెబ్బెన : పంచాయతీ కార్మికులు సమ్మెలో భాగంగా 8వ రోజు గురువారం కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ 8 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. జీఓ 51 సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, జీఓ 60 ప్రకారం రూ.19వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దుర్గం దేవాజీ, జుమ్మిడి సంతోష్, వెంకటేశ్, రమేష్, శ్రీనివాస్, లక్ష్మి, మహేందర్ పాల్గొన్నారు.

తాంసి : పారిశుద్ధ కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. గురువారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలలో వారం రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి మురికి కాలువలు, చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తుంటారని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో చిలక దేవిదాస్ పలువురు కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించి, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలో కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బీజేపీ మహిళా మోర్చా నాయకులు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను, మురికి కాలువలను శుభ్రం చేస్తూ వారి జీవితాలను సమాజ సేవకే అంకితం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికుల వేతనాలు పెంచి ఇతర డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, ఉపాధ్యక్షురాలు సామ భూలక్ష్మి పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ గురువారం మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు కార్మికులకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె ఉధృతం అవుతుందని హెచ్చరించారు.



మందమర్రి



కాసిపేట



రెబ్బెన



తాంసి



దిలావర్‌పూర్

చికెన్ వండలేదని భార్యను గొడ్డలితో నరికిన భర్త



నవతెలంగాణ-జైపూర్

కట్టుకున్నోడే కాలయముడైండు..నిద్రిస్తున్న భార్యను గొడ్డలితో నరికి చంపాడు. చెన్నూర్ మండలం కిష్టంపేట్ గ్రామంలో గురువారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం..గాలిపల్లి పోశం చికెన్ కూర వండే విషయంలో బుధవారం సాయంత్రం భార్య శంకరమ్మ(45)తో గొడవపడ్డాడు. కోరినట్లు భార్య చికెన్ కూర వండలేదన్న కోపంతో నిద్రిస్తున్న భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన పోశం భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్ర మద్య తాగి ఇంటికొచ్చిన పోశంకు భార్య వంకాయ కూరతో అన్నం వడ్డించింది. దీంతో గొడవకు దిగాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన శంకరమ్మ అరుపులకు పక్క గదిలో ఉన్న కుమారులు, స్థానికులు సమీపంలో గల ఎల్లక్కపేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని చెన్నూర్ సీఐ వాసుదేవరావు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి పెద్ద కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి



నవతెలంగాణ - రెబ్బెన

కనీస వేతనాలు ఇవ్వాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగే ధర్నాలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎ ఓదెలు కోరారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 9సంవత్సరాల నుండి సింగరేణి కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరుబాట పట్టిన సీఐటీయూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడానికి నిర్ణయించినట్టు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల పోరాటాల ఫలితంగా 2021 జూన్ 30న జీవో నెం 22 విడుదల చేసినప్పటికీ గెజిట్ చేయకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. సమావేశంలో విజయ్, ప్రవీణ్, వెంకటేశ్, పొచ్చన్న, ధర్మారావు, మొండి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ సందర్భంగా హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లో అరెస్టుకు, ఖమ్మంలో విద్యార్థి సంఘాల నాయకులపై దాడి చేసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఖమ్మంలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఇచ్చిన బంద్‌కు వ్యతిరేకంగా పాఠశాలను కొనసాగించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యాన్ని బంద్ పాటించాలని విద్యార్థి సంఘాల జేఏసీ కోరగా బౌన్సర్లను పెట్టి విద్యార్థి సంఘాల నాయకులపై దాడి చేయించడం అమానుషమని తెలిపారు. అనునిత్యం విద్యారంగ సమస్యల మీద పోరాటం చేస్తున్న విద్యార్థుల నాయకులపై పోలీసుల దౌర్జన్యం సరికాదన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ టౌన్ అధ్యక్షుడు అనిరుద్దీన్ పాల్గొన్నారు.

గురుకుల సమస్యల పరిష్కారానికి 17న ధర్నా



కాగజ్‌నగర్: గురకులాల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వి శాంతికుమారి తెలిపారు. గురువారం కాగజ్‌నగర్ మండలంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల-2లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ గురుకులాల సమయాలలో మార్పులు చేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, సీఆర్‌టీలను రెగ్యులర్‌చేయాలని, వారాంతపు సెలవు అమలుచేయాలని, ప్రత్యేక వార్డెన్ కేడర్లను అమలు చేయాలని, అన్ని సొసైటీలలో ఏకరూప పాలన అమలు చేయాలనే తదితర డిమాండ్లతో ఈ ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గురుకులాల కో కన్వీనర్ నరేష్, మండల బాధ్యులు మహిపాల్, నజీమ్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
5
శుక్రవారం 14 జులై 2023

పశుగ్రాసం పెంపకంపై అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-దండేపల్లి



పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పశుగ్రాసం పెంపకంపై మండలంలోని పాతమామిడిపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య పశుగ్రాసాలైనా సూపర్ నేపియర్, హెడ్జు లూషన్, అవిస వంటి రకాలైన పశుగ్రాసాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వాటి పెంపకంలో మెలుకులను రైతులకు నేర్పించారు. అదే గ్రామానికి చెందిన రామస్వామి అనె రైతు పశుగ్రాసం పెంపకంలో ఆధునిక పద్ధతులు పాటిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్, గ్రామ రైతులు పశువైద్య సిబ్బంది కృష్ణవేణి, షరీఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మడేలేశ్వర స్వామి బోనాల జాతర

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని కర్ణమామిడి గ్రామంలో గురువారం రజకులు మడేలేశ్వర స్వామి బోనాలు నిర్వహించారు. గ్రామంలోని రజకులు, ఇతర కులస్థులు ఈ బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా గ్రామం నదివీదులు తిరుగుతూ గ్రామ చివరన వున్న మడేలయ్య గుడు వద్దకు చేరి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టే మహేందర్, ఎంపీటీసీ గోళ్ళ భాగ్యవ్వ, రజక సంఘం మండల అధ్యక్షుడు తంగళ్ళపల్లి సతీష్, కొత్త కొండ ప్రదీప్, లింగయ్య, సట్ల తిరుపతి, సతీష్, బొడ్డు తిరుపతి, కోట పోచయ్యలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-ముధోల్

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు చేపట్టాలని డీఎల్పీఓ శివప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ముధోల్, బాసర మండలాల పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డేలో భాగంగా కమిటీ సభ్యులైన సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యదర్శి, ఉపాధ్యాయుడు, ఆశ వర్కర్, అంగన్‌వాడీ టీచర్లు గ్రామంలో అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామంలో మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, మురికినీరు నిల్వ ఉండకుండా, దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. గృహ పరిసర ప్రాంతాలలో, రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి, చెత్త చెదారాన్ని విలేజ్ డంపింగ్ యార్డ్‌కు తరలించాలని పేర్కొన్నారు. మంచినీటి పైపు లీకేజీని అరికట్టాలని అన్నారు. లోతట్టు ప్రాంతంలో నీటి నిల్వలను తొలగించుట గుంతలు పూడ్చుట నీటి నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయుట, బ్లీచింగ్, ఫినాయిల్, మొదలైన వాటిని చల్లడం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అమీర్‌ఖాన్, డా.ఆకాష్, సీడీపీఓ శ్రీమతి, మన్మోహన్ శాస్త్రీ, పంచాయతి కార్యదర్శులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యార్థం మంజూరు చేసిన నిధులతో కచ్చితంగా రోడ్డు పనులు చేపట్టాలని, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావు, జిల్లా అధ్యక్షుడు విష్ణు, మండల అధ్యక్షుడు మల్కు డిమాండ్ చేశారు. గురువారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్ పాయ్‌ను కలిసి సమస్యలపై వివరించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలోని 68 గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యానికి తెలంగాణ ప్రభుత్వం రూ.52 కోట్లలను మంజూరు చేసిందన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదని, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వర్షాలు పడుతున్న సందర్భంగా గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యం బారిన పడ్డ గిరిజనులకు ఆస్పత్రికి వెళ్లాలన్న రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గతంలో మృతి చెందిన సంఘటనలు అనేకంగా ఉన్నాయని అన్నారు. ఈ నిధులు పక్కదారి పట్టకుండా గిరిజన గ్రామాలకు రోడ్డు పూర్తిచేయాలని కోరారు. పీఓకు వినతిపత్రం అందించిన వారిలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నిరసనలు.. కాంగ్రెస్ నాయకులు అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసులు కొమ్ము కాస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను అధికార బీఆర్ఎస్ నాయకులు ఉరి వేసి గంటలు వేలాడ దీసి ఉంచిన పోలీసుల కండ్లకు కనిపించలేదా అంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు మెడకు తాడు కట్టి ఉరి తీశారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మధ్యాహ్నం ఒంటిగంటలోపు ఉరిని తీసేయాలని, లేనిపక్షంలో ఒంటి గంటకు నిరసన స్థలానికి వచ్చి కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. కాగా ఒంటిగంటకు ఉరి తీయకపోవడంతో ఘటన స్థలానికి కాంగ్రెస్ నాయకులు చేరుకున్నారు. పోలీసులు వారి దగ్గరకు వచ్చి మాట్లాడారు. మర్యాదగా చెప్పున్నాం అంటూ ఉరిని తీసేయమని పోలీసులను కోరారు. దీంతో పోలీసులు వారిని వాహనంలో ఎక్కించి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ ఘటనలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్ అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పోలీస్ స్టేషన్ వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం నగేష్‌ను రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

అధికార పార్టీ కోక న్యాయం, ప్రతిపక్ష పార్టీలకు ఒక న్యాయమా..!

రిమ్స్‌లో మీడియాతో సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ అధికార పార్టీ కార్యకర్తలకు నాయకులకు స్వయంగా పోలీసులే ప్రొటెక్షన్ ఇచ్చిమరి దిష్టిబొమ్మను ఉరి తీయించి దహనం చేసే కార్యక్రమంలో పోలీసులు భాగమయ్యారన్నారు. అధికార పార్టీ కోక న్యాయం, ప్రతిపక్ష పార్టీలకు ఒక న్యాయమా అంటూ ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యామ లేక కల్వకుంట్ల వారి కుటుంబ స్వామ్యమా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరితీసి గంటల తరబడి అలాగే ఉంచారని దాన్ని తీసివేయాలని డీఎస్పీకి, సీఐలకు చెప్పామని అన్నారు. ఇచ్చిన సమయం మించిన కూడా అలాగే ఆ దిష్టిబొమ్మ ఉరి తీయబడి ఉందని పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని అన్నారు. కాగా అక్కడికి వెళ్లిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపల్లి నగేష్ వారి బృందంపై పోలీసులు ముకుమ్మడి దాడి చేసి వారిని దౌర్జన్యంగా పోలీసు జీబ్‌లో ఎత్తి పడేశారని అన్నారు. గుడిపల్లి నగేష్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో ఉన్నారని ఇలా చేయడం ఎంతవరకు న్యాయమని అన్నారు. దీనికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయాలని, డీసీసీ పిలుపునిచ్చారు.

గ్రామపంచాయతీ కార్మికులకు అండగా ఉంటా

నవతెలంగాణ-ఇచ్చోడ

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు వారికి అండగా ఉంటానని మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ లోక శిరీష్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కార్మికుల నిరవధిక సమ్మె 8వ రోజు సందర్భంగా కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి సమావేశంలో రూ.2వేల 500 వేతనం పెంచుతూ తీర్మానం చేసినట్లు తెలిపారు. న్యాయమైన కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలని కోరారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ చౌహాన్ సునీత, వైస్ ఎంపీపీ కమల జల్లె జాకు, కార్మికులు అశోక్, రాజేశ్వర్, భూమన్న, నారాయణ పాల్గొన్నారు.

ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ కుట్రలు

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణలో కాంగ్రెస్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అధికార బీఆర్ఎస్ కుట్రలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరివేసి దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనికి నిరసనగా పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించిందని అన్నారు. కార్యక్రమంలో గిమ్మ సంతోష్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మెన్ షకీల్, సాత్నాల ప్రాజెక్ట్ చైర్మెన్ అల్లూరి అశోక్‌రెడ్డి ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరి రవి, ఎంపీటీసీ మనోజ్ ఉన్నారు.

సీఎంఆర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు డి.మధుసూదన్ నాయక్, బి.రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి ఆర్డీఓ, జిల్లా అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైస్ మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సీఎంఆర్ ప్రక్రియ వేగవంతం చేసే దిశగా ఆయా మండల తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని, ప్రతి రైస్ మిల్ 18 గంటలు పనిచేసే విధంగా చూడాలని, లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా తహసీల్దార్లు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతిరోజు కనీసం 70 శాతం కంటే ఎక్కువగా ఉండేలా 2,3 రోజులకు ఒకసారి ఆయా మండల తహసీల్దార్లు రైస్ మిల్లులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములలో నివాసం ఏర్పాటు చేసుకున్న వారికి జీఓ నెంబర్ 58, 59 ద్వారా, సింగరేణి భూములలో నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారికి జీఓ నెంబర్ 76 ద్వారా యాజమాన్య హక్కు కల్పిస్తూ ప్రభుత్వం భూముల క్రమబద్ధీకరణ చేస్తుందని, ఈ క్రమంలో జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ఆయా సంబంధిత బకాయి ఉన్న రుసుములు చెల్లించేలా అవగాహన కల్పించి వసూలు చేయాలని సూచించారు. రుసుము చెల్లించేందుకు నిరాకరించినట్లయితే సంబంధిత అభ్యర్థుల భూములలో ఉన్న కట్టడాలను కూల్చివేసేందుకు నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు దాసరి వేణు, శ్యామలాదేవి పాల్గొన్నారు.



టింబర్ యార్డ్ కార్మికులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



టింబర్ యార్డ్ కార్మికులకు న్యాయం జరిగే వరకు హెచ్ఎంఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా స్టోర్‌లో ఫిట్ కార్యదర్శి పల్లె క్రాంతి కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 34 సంవత్సరాలుగా స్టోర్స్‌లో పనిచేస్తున్న (టింబర్ యార్డ్) పీస్ రేటెడ్ కార్మికులకు మొదటి కేటగిరి వేతనం పొందుతూ పనిచేస్తున్నారని తెలిపారు. నాలుగవ వేజ్బోరి నుండి వారి బేసిక్ పెరగవలసి ఉన్నప్పటికీ 11వ రోజు బోర్డ్ అమలు జరిగిన తర్వాత కూడా కేటగిరి 1 బేసిక్ ద్వారా జీతం తీసుకుంటున్నారని తెలిపారు. దీంతో పీస్ రేటెడ్ కార్మికులు ప్రతినెల రూ.20వేల నుండి 30 వేల వరకు వేతనాలు నష్టపోతున్నారు అన్నారు. దీంతోపాటుగా సీఎం పిఎఫ్, పెన్షన్ కూడా పెద్ద మొత్తంలో నష్టపోతున్నారని తెలిపారు. దీనికి ప్రధాన కారణం ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, సింగరేణి యాజమాన్యం అని ఆరోపించారు. కార్మికులను పీస్ రిటైర్డ్‌గా డిసిగ్నేషన్ మార్చినప్పుడు గ్రూప్ 5లో సంబంధిత వేతనాలు యజమాన్యం చెల్లించాలని ఎన్సి డబ్ల్యూఏ నిబంధనలు ఉన్నప్పటికీ యాజమాన్యం చెల్లించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైఫ్ ప్రెసిడెంట్ సారయ్య కార్యదర్శి వి.అనిల్‌రెడ్డి, సెంట్రల్ నాయకులు గోళ్ళ సత్తయ్య, నర్సయ్య, దుర్గన్న లక్ష్మణ్, ఏరియా ఫిట్ కార్యదర్శిలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అశోక్, వలి, తన్వీర్, వినయ్, శీను, ఎస్‌టీపీపీ నాయకులు సాయి కృష్ణారెడ్డి, ఉపేందర్ రావు, ఇర్ఫాన్, ప్రేమ్ కుమార్, శ్రీను పెద్దయ్య పాల్గొన్నారు.

తండా, గూడాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే



నవతెలంగాణ-జన్నారం

మారుమూల తండాలను, గిరిజన గూడాలను, గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండలంలోని సింగరాయపేట, కామన్‌పల్లి గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పల్లెలను పట్టించుకోలేద అన్నారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం పల్లెలను మరింత అభివృద్ధి చేయడానికి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు, చేయడం జరిగిందన్నారు. నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ఆ తాండాలలో గూడాలలో ఉన్న వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు సింగరాయపేట సర్పంచ్ జైనేని నడిపి భీమయ్య, కామన్పల్లి సర్పంచ్ పేరం మానస శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సూర్య జనార్ధన్, కోఆప్షన్స్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, జిల్లా నాయకులు భరత్ కుమార్ ఎంపీటీసీల పురం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నాసాని రాజన్న, శీలం రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, నర్సాగౌడ్ బీవీఎస్ నాయక్, మౌలానా తోకల సురేష్ గీతా, భరత్ నాయక్ రాకేష్, జనగురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సుమన్

నవతెలంగాణ-మందమర్రి

చెన్నూరు నియోజకవర్గం మందమర్రిలో గురువారం పర్యటించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ నూతన భవనాలను ప్రారంభించారు. పాత బస్టాండ్ ప్రాంతంలోని నూతనంగా నిర్మించిన డ్రీమ్ ఫోటోగ్రఫీ షాప్, అనంతరం మందమర్రి పోలీస్ స్టేషన్ సమీపంలోని గ్యాస్ గోదాం వద్ద శ్రీ భక్త మార్కండేయ దేవాలయ నిర్మాణానికి భూమి పూజ, అలాగే నూతనంగా నిర్మించిన భవన నిర్మాణ కార్మిక సంఘం, ఫోటో వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఫోటో భవన్‌లని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు జే రవీందర్, పట్టణ ఇన్‌ఛార్జి బత్తుల శ్రీనివాస్, సూరిబాబు, మద్ది శంకర్ పాల్గొన్నారు.



ఘనంగా మార్కెట్ వ్యాపారస్తుల ఆషాడ మాస బోనాలు

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాయల్ టాకీస్ వద్ద వారసంత మార్కెట్ వ్యాపారుల ఆధ్వర్యంలో ఆషాడ మాస బోనాలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీసీసీ కార్నర్ నుంచి రాయల్ టాకీస్ వారసంతవరకు డప్పు చప్పులతో, అమ్మవారి వేషధారణలో బోనం ఎత్తుకొని నృత్యాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారసంతా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఆషాడ మాస బోనాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొక్కిరాల రావిపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అందజేసినట్లు నస్పూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిల్ల వేణు తెలిపారు.



యువతీ,యువకులు ఓటరు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-కౌటాల

18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సాయన్న అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటరు నమోదుచేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మీ చుట్టుప్రక్కల ఉన్నవారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు మన బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీకాంత్ పాల్గొన్నారు

పత్తిలో కలుపు నివారణ తప్పనిసరి



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని అంభఘాట్ శివారులోని పత్తి పంటలను గురువారం ఏఈఓ మారుతి పరిశీలించారు. కలుపు నివారణ తప్పనిసరిగా సరైన సమయంలో చేయాలని కోరారు. మోతాదుకు మించి ఎరువుల వాడకం వల్ల కలుపు ఎక్కువ అవుతుందన్నారు. పత్తి విత్తనాలు విత్తిన వెంటనే కలుపు నివారణ కోసం విత్తిన రెండు, మూడు రోజుల్లో పెండిమిథాలిన్ మందును ఎకరానికి లీటర్ పిచికారి చేయడం ద్వారా 45 రోజుల వరకు కలుపును అరికట్టవచ్చన్నారు. 20,40,60 రోజుల్లో గొర్రుతో అంతర కృషి చేయడం ద్వారా కలుపును సమర్ధవంతంగా అరికట్టవచ్చున్నారు. వర్షాల కారణంగా అంతర కృషి చేయడం వీలుకాని పక్షంలో వెడల్పుకు మొక్కల నివారణకు, గడ్డి జాతి మొక్కల క్విజలో పాప్ ఈథైల్ పైరిథయోబ్యాక్ అనే మందు 500 మిల్లీ లీటర్ ఎకరానికి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తలండి తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని సదాశివ్‌పేట్ ఏరియాలో ప్రధాన రహదారి గుంతలమయమై వాహనదారులకు ఇబ్బందులు తలెత్తడంతో సర్పంచ్ వొజ్జెల మౌనీష్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ రోజూవారీ కూలీలతో పారిశుధ్య పనులను నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని పాత మాదవాయిగూడ గ్రామంలో నివసించే 25 కుటుంబాలకు పునర్వాసం కల్పించాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనందర్ కోరారు. గురువారం ఆసిఫాబాద్ బొర్కాడే హేమంత్ సహదేవరావు, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ అధ్యక్షుడు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత మాదవాయిగూడ గ్రామంలో వర్షాకాలంలో పెద్దవాగు నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించడం వల్ల ఇండ్లలోకి వరద నీరు వస్తుండడంతో అక్కడ నివసించే గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటారని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించి కలెక్టర్ త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

ఓటరు నమోదుకు 15 చివరి గడువు

నవతెలంగాణ-బెజ్జూర్

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడానికి మరో రెండు రోజులు చివరి అవకాశం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీపాల్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిన ఓటర్లు ఫామ్ నెంబర్ ఆరుతో పాటు పుట్టిన తేదీ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జతచేసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి చెరువు దగ్గర ప్రత్యక్షం

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న 3వ తరగతి చదువుకుంటున్న మాడవి జ్ఞానేశ్వర్ గురువారం ఉదయం పాఠశాల నుంచి పాఠశాల సిబ్బందికి తెలియకుండా బయటకు వెళ్లిపోయి నడుచుకుంటూ వెళ్లి వడ్డాడి మత్తడి చెరువు దగ్గరకు వచ్చి ఏడుచుకుంటు కూర్చున్నాడు. ఉదయం జిల్లా కేంద్రానికి పాలు విక్రయించే వ్యక్తి గమనించి, విద్యార్థి వద్దకు వెళ్లి వివరాలు అడగగా బాలుడు ఏమి చెప్పకపోవడంతో ఆ విద్యార్థిని ఆదిలాబాద్‌లో తాను పాలు పోసే వ్యక్తి శేఖర్ వద్దకు బాలుని తీసుకవెళ్లాడు అక్కడ కూడా బాలుడు ఇలాంటి వివరాలు తెలుపకపోవడంతో విద్యార్థి ఫోటో తీసి వాట్సాప్‌లో వైరల్ చేయడంతో పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు చూసి బాలుని వద్దకు వచ్చాడు. విద్యార్థి గాదిగూడ మండలంలోని పరస్వాడ గ్రామానికి చెందిన విద్యార్థిగా గుర్తించారు. తాంసి మండలంలోని గిరిజన ఆశ్రమం పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అని తెలపడంతో ఉపాధ్యాయునికి విద్యార్థిని అప్పగించారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవరించడంతో విద్యార్థుల తల్లదండ్రులు మండిపడుతున్నారు.

ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకై వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడులలో శిక్షణ పొందడానికి అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సుజాత గురువారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు ఐటీఐతెలంగాణ.గావ్.ఇన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోనే అభ్యర్థులు 10వ తరగతి, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అలాగే దరఖాస్తు సమయంలో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే 9493535378 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పదో తరగతి టాపర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

మండలంలోని సత్తెనపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో గత ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన జక్కుల భవానీని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మెన్ పి.చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గురువారం ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు డాక్టర్ కేహెచ్ ఖాన్, అల్వాల హనుమంతు, శ్రీనివాసరావులు నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత రాణించాలని ఉద్దేశంతో చిరు ప్రోత్సాహకంగా తాము ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. లయన్స్ క్లబ్ వారిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాల్గోట్ శ్రీనివాస్, కిష్టయ్య, రాజేందర్, సుజాత, కవితలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో బహిర్గతమైన గ్రూప్ విభేదాలు

ఆదిలాబాద్‌టౌన్ : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదిలాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ చేపట్టిన కార్యక్రమంలో గ్రూప్ విబేదాలు బహిర్గతమయ్యాయి. గురువారం స్థానిక ఆర్ అండ్ బి ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే జోగు రామన్న పేరుతో డీజే పాటలు వినిపించడంతో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు గ్రూప్ అడ్డుకోవడం ఇరు గ్రూప్‌ల నడుమ స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. కాగా బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆలాల్ అజయ్ జోక్యం చేసుకోని, మీ ఎమ్మెల్యే పాటలు వేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.